సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



ప్రయాణం మేడారం వైపు..

నాలుగు రోజుల పాటు జరగనున్న సమ్మక్క – సారలమ్మ జాతరకు హాజరయ్యేందుకు జిల్లా ప్రజలు మేడారం బాట పట్టారు. 8లో



లేక్ వ్యూ పార్క్ ప్రారంభం

ఇల్లెందులోని లేక్ వ్యూ పార్క్‌ను పట్టణ వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 20°

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వేళ వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ముందుండాలి

ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంరూరల్ : పోలీసు శాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణలో ముందుండాలని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. జిల్లా నుంచి కానిస్టేబుళ్లుగా ఎంపికైన 75 మందితో లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలోని 6వ బెటాలియన్‌లో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభ్యర్థులకు తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణ నిమిత్తం ట్రెనింగ్ సెంటర్లకు పంపిస్తున్నామని, క్రమశిక్షణతో ట్రెనింగ్ పూర్తి చేయాలని సూచించారు. అర్హత సాధించిన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, అడ్మిన్ ఆర్‌ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

టీపీహెచ్‌డీఏ కార్యవర్గం ఎన్నిక



టీపీహెచ్‌డీఏ జిల్లా నూతన కమిటీ

కొత్తగూడెంరూరల్: తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్(టీపీహెచ్‌డీఏ) జిల్లా నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.బాలాజీనాయక్, బి.శివకుమార్, కోశాధికారిగా మురళీకృష్ణ ఎన్నికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా కళ్యాణ్, ప్రియాంక, నిశాంత్ రావు, స్పందన, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాకేష్‌కుమార్, దినేష్, పుల్లారెడ్డి, మనీష్‌రెడ్డి, కృష్ణ దీపక్‌రెడ్డి సంయుక్త కార్యదర్శులుగా రాజశేఖర్, చైతన్య, మధువరన్, రేవంత్, సంఘమిత్ర, గౌరవ సలహాదారులుగా డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రాజును ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

జేవీఆర్ ఓసీలో రష్యా బృందం



జేవీఆర్ ఓసీలో జీఎంతో రష్యా బృందం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీలో రష్యాకు చెందిన మల్టీ నేషనల్ ఎనర్జీ కార్పొరేషన్ సంస్థ సభ్యులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా జేవీఆర్ ఓపెన్ కాస్ట్‌ను సందర్శించిన వారు ఇక్కడ ఉపయోగించే షావెల్స్‌ను పరిశీలించడంతో పాటు డంపర్లు పనిచేసేందుకు డీజిల్ బదులుగా లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్(ఎల్‌ఎన్‌జీ)ని వినియోగానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు, అధికారులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలేవి?



కేటీపీఎస్ స్టోర్ నుంచి చోరీ అయిన సొత్తు ఇదే.. (ఇన్‌సెట్) గోడకు కన్నం వేసిన దృశ్యం



కేటీపీఎస్ స్టోర్స్‌కు భద్రత కరువు

- గోడౌన్‌లో రూ.కోట్ల విలువైన స్పేర్ పార్ట్స్ నిల్వ
- తరచూ చోరీకి గురవుతున్న జెన్‌కో సొత్తు
- పటిష్ట చర్యలు తీసుకోవడంలో అలసత్వం

పాల్వంచ : పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని ఓఅండ్‌ఎం కర్మాగారం గోడౌన్‌లో నిల్వ చేసే సామగ్రికి రక్షణ కరువైంది. ఈ గోడౌన్‌లలో రూ.కోట్లు విలువ చేసే స్పేర్‌పార్ట్‌లు ఉంటాయి. అక్కడి నుంచి ఏ చిన్న వస్తువు బయటకు వెళ్లాలన్నా అనేక నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అయితే ఇంతటి విలువైన సామగ్రికి రక్షణ లేకపోవడంతో ఇక్కడ తరచూ చోరీలు జరుగుతున్నాయి. కొందరు చాకచక్యంగా సొత్తు అపహరించి అతి తక్కువ ధరలకు స్క్రాప్ షాపుల్లో అమ్ముకుంటున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇంజనీర్లు సైతం విలువైన వస్తువులను బయటకు తరలించి కేసుల పాలైన ఘటనలు కూడా ఉన్నాయి. ఇలా చోరీల పరంపర కొనసాగుతున్నా పటిష్ట చర్యలు తీసుకోవడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఈ గోడౌన్‌లకు ఎస్పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) సెక్యూరిటీ రక్షణగా ఉండేవారు. ఇటీవల పాతప్లాంట్ మూసివేతతో ఎస్పీఎఫ్ సిబ్బందిని సైతం ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వారి స్థానంలో జెన్‌కో హోం గార్డులు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించినా.. దొంగతనాలు ఆగకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా సోమవారం పట్టణంలోని ఓ పాత ఇనుము దుకాణంలో ఎంతో విలువైన స్టోర్ సామగ్రిని జెన్‌కో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అప్పటివరకు చోరీల విషయం ఓఅండ్‌ఎం అధికారులకు తెలియకపోవడం గమనార్హం. చోరీ ఘటనపై వివరాలు ఇవ్వాలని జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బి.లక్ష్మయ్య ఆదేశించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే సీఈ వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఎస్పీ రమేశ్, ఇతర ఇంజనీర్లు చోరీ ఘటనపై విచారణ చేపట్టారు. కాగా, గోడౌన్ ముందు ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా, వెనుక భాగంలో ఏర్పాటు చేయలేదని, ఆ వైపు నుంచే చోరీలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు.

రూ.60 కోట్ల విలువైన పరికరాలు నిల్వ..

స్టోర్స్ గోడౌన్‌లో రూ.60 కోట్లు విలువ చేసే స్పేర్ పార్ట్స్ నిల్వ ఉంటాయి. కేటీపీఎస్ 5,6,7 దశల కర్మాగారాల్లో ఎలాంటి సమస్య వాటిల్లినా, వాటిలో విడి భాగాలు మార్చాలంటే ఈ స్టోర్ నుంచి తీసుకొస్తుంటారు. మరమ్మతుకు గురైన వాటికి ఇక్కడి సిబ్బందికి అప్పగించి కొత్తవి తీసుకెళ్లాలి. ఇక్కడ అప్పగించే, తీసుకెళ్లే సామగ్రిని అధికారులు రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇంతటి జాగ్రత్తలు పాటిస్తున్నా.. పక్కదారి పట్టడం మాత్రం ఆగడం లేదు. ఈక్రమంలో గత సోమవారం రూ.40 వేల విలువ చేసే స్పేర్ పార్టులను ఓ స్క్రాప్ దుకాణం నుంచి జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేశ్ స్వాధీనం చేసుకున్నారు. దీని అసలు విలువ రూ.లక్షల్లో ఉండగా తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. అయితే ఇది ఎలా బయటకు వెళ్లిందనే కోణంలో విచారణ చేపట్టిన అధికారులు.. గోడౌన్ వెనుక భాగంలో గోడకు కన్నం వేసి సొత్తును బయటకు తరలించారని గుర్తించారు. ఇలా చోరీలు జరుగుతున్నా అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది ఏం చేస్తున్నారనే సందేహాలు తలెత్తుతున్నాయి. గోడౌన్ ముందు భాగంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అధికారులు వెనుక భాగంలో మాత్రం అమర్చలేదు.

గతంలో హెచ్చరించినా..

కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలోని ఓఅండ్‌ఎం కర్మాగారంలో 107 మంది, 5,6 దశల్లో 123 మంది, 7వ దశలో 52 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది పనిచేస్తుండేవారు. అయితే ఓఅండ్‌ఎం కర్మాగారం మూతబడడంతో వారిని ఇతర ప్రాంతాలకు పంపించారు. ప్రస్తుతం స్పేర్ మెటీరియల్ స్టోర్స్, అడ్మిన్ బ్లాక్‌ల భద్రతను జెన్‌కోలో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న 16 మందితో పాటు, బీటీపీఎస్ భూ నిర్వాసితుల పేరుతో ఉద్యోగాలు పొందిన 25 మంది హోంగార్డులకు అప్పగించారు. అయితే వీరితో భద్రత సాధ్యం కాదని హెచ్చరిస్తూ గతేడాది అక్టోబర్ 2న 'కేటీపీఎస్‌కు భద్రత కుదింపు', అక్టోబర్ 22వ తేదీన 'రక్షణకు మంగళం' అనే కథనాలను 'సాక్షి' ప్రచురించింది. అయినా తీరు మారకపోవడంతో అక్కడ రూ.లక్షల విలువ చేసే సొత్తు బయటకు తరలిపోవడం గమనార్హం. ఈ విషయమై విజిలెన్స్ డీఎస్పీ రమేశ్‌ను వివరణ కోరగా అక్కడ సొత్తు బయటకు పోయిన విషయాన్ని గుర్తించామని, గోడకు కన్నం వేసి సొత్తు బయటకు తరలించారని చెప్పారు. ఈ ఘటనపై అక్కడి ఇంజనీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

కేటీపీఎస్ ఓఅండ్‌ఎం స్టోర్స్ గోడౌన్‌లో మెటీరియల్ చోరీ ఘటనపై పాల్వంచ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఓఅండ్‌ఎం పరిధిలోని సెంట్రల్ స్టోర్ గోడౌన్ షెడ్ 44 వెనుక భాగంలో ఈనెల 17న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోడకు కన్నం వేసి లోనికి ప్రవేశించి విలువైన మెటీరియల్ చోరీ చేశారు. 157 నికేన్ పైపులు, 4 రాడ్లు, బోల్ట్‌లు, నట్‌లు చోరీకి గురయ్యాయని 18వ తేదీ ఉదయం ఇంజనీర్లు గుర్తించారు. వీటి విలువ రూ.50,631 ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు కేటీపీఎస్ 7వ దశ ఏఈ మెరుగు స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు. అయితే అదే స్టోర్ నుంచి ఇంకా విలువైన కాపర్ వైర్ కూడా చోరీకి గురైనట్లు సమాచారం. దీనిపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈనెల 17న చోరీ జరిగితే ఆ తెల్లవారే అధికారులు గుర్తించినప్పటికీ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడం ఏంటనే అంశంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. చోరీ అయిన సొత్తు విలువ కూడా ఇంకా ఎక్కువగా ఉంటుందని సమాచారం.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, పక్కన ఎమ్మెల్యేలు, కలెక్టర్

- జెడ్పీ సమావేశంలో చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు
- హాజరైన ఎమ్మెల్యేలు, అధికారులు

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జిల్లాలో అర్హులైన పేదలందరికీ అందేలా చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు అన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో వ్యవసాయం, వైద్య, విద్య, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు, దివ్యాంగ సంక్షేమ శాఖలపై నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వసభ్య సమావేశంలో చర్చించిన అంశాలపై లోతుగా విశ్లేషించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను కోరారు. తీసుకున్న చర్యలపై సభ్యులకు నివేదిక ప్రతులను అందజేయాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన అంశాలపై జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించాలని, కొత్తగూడెంలోని మాతా శిశు ఆస్పత్రి నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. సిబ్బంది కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుత జెడ్పీ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని, నూతన కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులు నిర్మించుకున్న ఇళ్లకు నంబర్లు కేటాయించాలన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెప్పించి పరిష్కారానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని అన్నారు. కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ జిల్లాలో 1/70 చట్టం అమల్లో ఉన్నందున ఇళ్లకు నంబర్లు కేటాయించలేదని తెలిపారు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలకు పూర్తిగా సమాచారం ఇవ్వలేకపోయామని, అధికారుల బదిలీలతో ఈ సమస్య ఏర్పడిందని, వచ్చే సమావేశం నాటికి సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆస్పత్రులకు యాస్పిరేషన్ నిధులు కేటాయించినట్లు వివరించారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు తెప్పిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ ప్రసూన రాణి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు తిప్పన సిద్దులు ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సైనిక ఆరాంఘర్, ఫ్లడ్ రిలీఫ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబేదార్, బండారు వెంకన్న, హవల్దార్ ఆర్‌కే బెన్‌హర్, నాయక్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: సమ్మక్క – సారలమ్మ జాతర నేపథ్యంలో పర్యావరణ వాల్‌పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతర సందర్భంగా పర్యావరణ పరిరక్షణ విషయంలో జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మోడల్ జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించి పర్యావరణం–పరిరక్షణ అంశాలపై చర్చించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు, ఏసీఓ ఎస్.మాధవరావు, ఏఎంఓ నాగరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ఆందోళన



ఎమ్మెల్యేకు గోడు చెప్పుకుంటున్న బాలికలు

- భోజనం నాణ్యంగా ఉండడం లేదని నిరసన
- సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే కనకయ్య దృష్టికి సమస్యలు

టేకులపల్లి : నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, కూరలు ఏమాత్రం రుచిగా ఉండడం లేదని, ఈ భోజనం ఎలా తినాలని స్థానిక కేజీబీవీ విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పీడీఎస్‌యూ నాయకులు కాంపాటి పృథ్వీ, తరుణ్ తదితరులు పరిశీలనకు వెళ్లగా విద్యార్థినులు వారికి తమ సమస్యలు తెలిపారు. దీంతో కళాశాల, పాఠశాల విద్యార్థినులతో కలిసి వారు ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో కేజీబీవీ సమీపంలోనే ఉన్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఈ విషయం తెలియగా, ఆయన పాఠశాలకు చేరుకున్నారు. సమస్యలేంటని విద్యార్థినులను ప్రశ్నించగా.. 'ఇక్కడ చాలా ఇబ్బందిగా ఉంది. ఉండలేకపోతున్నాం. అన్నం తినలేకపోతున్నాం. కరెంట్ లేదు. సరిపడా నీళ్లు లేవు. బాత్‌రూమ్‌లు సరిపడా లేవు' అంటూ తమ సమస్యలు వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే పాఠశాల ఎస్‌ఓ, సిబ్బందిని మందలించారు. బాలికలకు నాణ్యమైన భోజనం పెట్టాలని, వారిని తిట్టినా, ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. భోజన వర్కర్లను మార్చాలని ఎస్‌ఓను ఆదేశించారు. కాగా, కాంట్రాక్టర్‌కు బిల్లులు సక్రమంగా రాకపోవడంతో సరుకుల సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని ఎస్‌ఓ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఈ సమస్యల పేరుతో విద్యార్థినులను ఇబ్బంది పెట్టొద్దని ఎమ్మెల్యే సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని ఏఈ దేవాను ఆదేశించారు.

గనుల్లో సింగరేణి ఉన్నతాధికారుల తనిఖీ



మాచరయ్యను సత్కరిస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో కేఓసీ, జేకేఓసీ గనుల్లో సింగరేణి కార్పొరేట్ జీఎం మాచరయ్య(స్టోర్స్), బీఆర్ దీక్షితులు(సెక్యూరిటీ), వేణుమాధవ్(డీజీఎం) మంగళవారం తనిఖీలు చేపట్టారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం వివిధ విభాగాల అధికారులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీఎం జాన్ ఆనంద్, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, పీఓ బొల్లం వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, స్టోర్ ఇంజనీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పూసపల్లి కుట్ర కేసు ఎత్తేయాలి

ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని



ఇల్లెందులో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

ఇల్లెందు: పూసపల్లి అక్రమ కుట్ర కేసు ఎత్తేయాలని ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇల్లెందులో విలేకరులతో మాట్లాడారు. చంద్రన్న వర్గానికి చెందిన రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ను ఈనెల 14న రఘునాథపాలెం మండలం కోయచెలక వద్ద పోలీసులు అరెస్టు చేశారని, రెండురోజుల తర్వాత మరికొందరిని అక్కడక్కడా అరెస్టు చేసి అందరినీ కలిపి పూసపల్లిలో సమావేశం నిర్వహిస్తున్నట్లు, ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్రపన్నినట్లు అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. అశోక్ అనారోగ్యంతో ఖమ్మం ఆస్పత్రికి వెళుతుండగా మూడు వాహనాల్లో వచ్చిన పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. న్యూడెమోక్రసీని నిషిద్ధ పార్టీగా ప్రభుత్వం ప్రకటించకపోయినా పోలీసులు మాత్రం నిషిద్ధ పార్టీగా అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఎన్డీ పోటీ చేసిందని గుర్తుచేశారు. సీఎం ప్రమాణ స్వీకారం రోజు కూడా తమ పార్టీకి ఆహ్వానం అందిందని, అలాంటి పార్టీని కుట్ర కేసుల పాలు చేయటం తగదని అన్నారు. పూసపల్లి కుట్ర కేసు ఎత్తేయాలని, భద్రాద్రి జిల్లా పోలీసుల తీరును సమీక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టితో పాటు జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. సమావేశంలో నాయకులు మామిడాల భిక్షపతి, ఎం.శ్రీనివాస్, రాసుద్దీన్, బయ్యా శారద, ఎల్. విశ్వనాథం, మోకాళ్ల శ్రీనివాస్, రాంసింగ్, ఎ.సాంబ, గణేష్ పాల్గొన్నారు.

కూంబింగ్ నిలిపివేయాలి

టేకులపల్లి: ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌తో పాటు నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు ఆ తర్వాత వందల మంది సిబ్బందితో ఏజెన్సీలో కూంబింగ్ నిర్వహిస్తూ, భయానక వాతావరణం సృష్టిస్తున్నారని, దాన్ని తక్షణమే నిలిపేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి నోముల భానుచందర్ డిమాండ్ చేశారు. టేకులపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ పాలనలోనూ నిర్బంధం కొనసాగుతోందని ఆరోపించారు. ప్రజాపాలన అని నేతలు ప్రకటిస్తున్నా పోలీసుల వైఖరిలో మార్పు రాలేదన్నారు. అరెస్టు చేసిన వారిని రోజుల తరబడి స్టేషన్‌లో పెట్టడం తగదన్నారు. సమావేశంలో నాయకులు పద్మ, నాగేశ్వరరావు, సతీష్, లక్ష్మణ్, జార్జి, పాపారావు, కిరణ్, బన్నీ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో 24న చండీ హోమం

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 24న మాఘ పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనదలచిన భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. పురుషులు ధోతి, కుండువా, మహిళలు చీరలు ధరించాలని కోరారు. వివరాలకు 9866923261, 6303408458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన వర్జీనియా పొగాకుకే గిట్టుబాటు ధర



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సురేంద్ర

అశ్వారావుపేటరూరల్: రైతులు నాణ్యమైన వర్జీనియా పొగాకు తీసుకొస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుందని ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం సూపరింటెండెంట్ సురేంద్ర తెలిపారు. అశ్వారావుపేట మండలం ఊట్లపల్లిలో పొగాకు సాగు, పాటించాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సురేంద్ర మాట్లాడుతూ.. పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్, ఆకు కోత సమయాన తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే నాణ్యమైన పొగాకు లభిస్తుందని తెలిపారు. తద్వారా గిట్టుబాటు ధర లభించి లాభాలు వస్తాయని చెప్పారు. అలాగే, పొగాకు సాగులో మోతాదుకు మించి పురుగుల మందులు వాడొద్దని సూచించారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో మాత్రమే 3,500 ఎకరాల్లో పంట సాగవుతోందని తెలిపారు. అనంతరం పొగాకు బ్యారన్లు, క్యూరింగ్ విధానాన్ని టుబాకో బోర్డు అధికారులు, ఉద్యోగులు పరిశీలించారు. ఈ సదస్సులో బోర్డు ఎస్‌జీఓ ప్రశాంత్, రైతు సంఘం నాయకులు వేముల ప్రకాశ్, సుంకవల్లి వీరభద్రరావు, సుంకవల్లి శంకర్, కోడూరి నాగేశ్వరరావు, వ్యాపారి చారువాక నాగేంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సోయం గంగులు' జీవితచరిత్ర ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

దమ్మపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు నాయకుడైన సోయం గంగులు జీవిత చరిత్రతో రూపొందించిన పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. గంగులు స్వగ్రామమైన దమ్మపేట మండలం జమేదారుబంజర గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించగా ప్రజాపంథా నాయకులు మాట్లాడారు. రజాకార్లు, యూనియన్ సైన్యాలకు వ్యతిరేకంగా పోరాడి 1951లో జరిపిన కాల్పుల్లో గంగులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో పాటు గుర్రం అచ్చయ్య, కెచ్చల రంగారెడ్డి, అమర్లపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీని ఆస్పత్రికి తరలించిన జవాన్లు


గిరిజనుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గుండం గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుండగా మంగళవారం సీఆర్‌పీఎఫ్ జవాన్లు, వైద్యులు పరీక్షించి బీజాపూర్ వైద్యశాలకు తరలించారు. గుండంలో ఇటీవల సీఆర్‌పీఎఫ్ క్యాంపును ఏర్పాటుచేయగా, ఈ గ్రామంతో పాటు సమీప గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ వైద్యులు, సిబ్బంది వైద్యశిబిరాలు నిర్వహిస్తూ మందులు పంపిణీ చేస్తున్నారు. ఈక్రమాన గుండం గ్రామంలో మంకం రాంబాబు అంతు చిక్కని వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించగా, ప్రత్యేక అంబులెన్స్‌లో బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు.

శివాలయ ప్రతిష్ఠాపన వాయిదా

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) సముదాయంలో రూ.74 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వాయిదా పడింది. ఈ నెల 29న ప్రతిష్ఠాపన చేయాలని ముహూర్తం నిర్ణయించగా, రెండు గ్రామాల ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈఓ ఎన్.రజనీకుమారి, పాలకవర్గ బాధ్యులు ఇటీవల సమావేశం ఏర్పాటు చేసినా ఓ నిర్ణయానికి రాలేదు. తిరిగి మంగళవారం సమావేశం నిర్వహించగా, హాజరైన సిద్ధాంతులు ప్రతిష్ఠాపనకు ఏప్రిల్ 24న మరో ముహూర్తం ఉందని తెలిపారు. అంత ఆలస్యం కాకుండా ఇంకో ముహూర్తం నిర్ణయించాలని భావిస్తూ ఈనెల 29న జరగాల్సిన ప్రతిష్ఠాపనను వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు. సమావేశంలో పాలకమండలి చైర్మన్ మహిపతి రామలింగంతో పాటు ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌వర్మకు విశ్వగురు సేవా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న విజయ్‌వర్మ

దుమ్ముగూడెం: మండలంలోని చెరుపల్లికి చెందిన సినీ నిర్మాత, దర్శకుడు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే పాకలపాటి విజయ్ వర్మకు విశ్వగురు సేవా పురస్కారం లభించింది. తాజాగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన హైకోర్టు జడ్జి వేణుగోపాల్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపకులు సత్యవోలు రాంబాబు, రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీకాంత్ తదితరులు ఆయన్ను అభినందించారు.

కొవ్వూరు రైల్వేలైన్ ఎంతవరకొచ్చింది?

అశ్వారావుపేట: కొవ్వూరు, భద్రాచలంరోడ్ రైల్వే లైన్ ప్రతిపాదన, పురోగతి ఎంతవరకొచ్చిందని అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన న్యాయవాది జూపల్లి కోదండవెంకటరామారావు సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేశారు. దీనికి రైల్వే అధికారులు ఇచ్చిన సమాధానాన్ని ఆయన 'సాక్షి'కి అందజేశారు. ఈ నెల 4న ఆన్‌లైన్‌లో రామారావు దరఖాస్తును స్వీకరించిన రైల్వే అధికారులు 14న సమాధానాన్ని అందించారు. 50–50 శాతం ప్రాతిపదికన ప్రాజెక్టును నిర్మించేందుకు 2023 ఏప్రిల్ 27 ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు రైల్వే శాఖ ప్రతిపాదన పంపగా ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. తిరిగి పూర్తి భారాన్ని రైల్వే శాఖ భరించేలా రూ.2867.99 కోట్ల ప్రతిపాదనను రైల్వేశాఖకు పంపించగా మంజూరు కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. రైల్వే శాఖ ఆమోదిస్తే నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రయాణం మేడారం వైపు..

- ఆర్టీసీకి జాతరకు వెళ్లే ప్రయాణికుల తాకిడి
- పిల్లాపాపలతో సమ్మక్క, సారలమ్మ సన్నిధికి పయనం
- జాతర బస్సుల్లో పోటెత్తుతున్న మహిళలు
- ప్రైవేట్ వాహనాలకు మరింత డిమాండ్



కొత్తగూడెం బస్టాండ్‌లో మేడారం ప్రయాణికులు, (ఇన్‌సెట్) బస్సు ఎక్కుతున్న భక్తులు

చుంచుపల్లి: నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న మహా జాతరను కనులారా తిలకించేందుకు జిల్లా ప్రజలు మేడారం బాట పట్టారు. మేడారం జాతరలో బుధవారం తొలి ఘట్టం ఆవిష్కృతం కానుంది. జాతర మొదటి రోజు సమ్మక్క కూతురు సారలమ్మ గద్దెల పైకి వచ్చే ఘట్టాన్ని తిలకించేందుకు ప్రజలు, భక్తులు జిల్లా వ్యాప్తంగా భారీగా ఆర్టీసీలో తరలివెళ్తున్నారు. ఆదివారం నుంచే అన్ని డిపోల పరిధిలో ఆర్టీసీ మేడారానికి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. సోమవారం ఉదయం వరకు మేడారానికి వెళ్లే ప్రయాణికుల నుంచి అంతగా స్పందన కనిపించలేదు. మంగళవారం ఉదయం నుంచి మేడారం వెళ్లే భక్తుల రద్దీ అన్ని ప్రాంతాల్లో ఒక్కసారిగా పెరిగింది. జిల్లా నలుమూలల నుంచి పిల్లాపాపలతో కుటుంబాలు మేడారం జాతరకు బయలుదేరాయి. తమ ఇష్ట దేవతలు సమ్మక్క – సారలమ్మలను దర్శించుకొని, మొక్కులు తీర్చుకోవడానికి కుటుంబ సమేతంగా ఉత్సాహంగా మేడారం పయనమయ్యారు. బుధ, గురు, శుక్ర, శని వారాల్లో నాలుగు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతరను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. 21న బుధవారం సారలమ్మ గద్దెలపైకి రానుంది. ఇక 22న తల్లి సమ్మక్కను గద్దెలపైకి తీసుకొస్తారు. 23న భక్తులు తమ మొక్కులను చెల్లించుకోవడం ఆనవాయితీ. చివరి రోజు 24న అమ్మవార్లు తిరిగి వన ప్రవేశంతో మేడారం జాతర ఘట్టం పూర్తవుతుంది. జాతర ఆరంభానికి ముందు రోజు జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో బయలుదేరడంతో కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు ఆర్టీసీ ప్రాంగణాలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. వన దేవతలు గద్దెనెక్కే దగ్గరి నుంచి తిరిగి అడవులకు వెళ్లే వరకు మూడు రోజుల పాటు జరిగే మేడారం జాతర కోసం జనం గురు, శుక్ర వారాల్లో తరలివెళ్లే అవకాశం ఉంది. మేడారం వెళ్లే భక్తులు ఈ మూడు రోజులు అక్కడే ఉండి అద్భుత ఘట్టాలను కనులారా చూసేందుకు మూటాముల్లే సర్దుకొని బయలుదేరుతున్నారు. జారత సందర్భంగా తమకు కావల్సిన ఆహార పదార్థాలతోపాటు మొక్కులు చెల్లించేందుకు బంగారం (బెల్లం), మేకలు, కోళ్లను వెంటబెట్టుకొని వెళ్తున్నారు. ప్రయాణికులు ఎక్కువగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుండగా, కొందరు ప్రైవేట్ వాహనాల్లో మేడారం జాతరకు తరలివెళ్తున్నారు. మేడారం జాతర నేపథ్యంలో ప్రైవేట్ వాహనాలకు డిమాండ్ మరింతగా పెరిగింది. ఇదే అదునుగా భావించి యజమానులు కిరాయిలు అమాంతం పెంచారు. గత జాతర కంటే ఈసారి 20 నుంచి 30 శాతం వరకు ఎక్కువ డిమాండ్ చేస్తున్నారు. టాటా ఎస్ వాహనానికి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు, 12 సీటర్ వెహికిల్‌కు రూ.9 వేలు, మినీ బస్సుకు ఏకంగా రూ.12 వేలు, ఇంకాస్త పెద్ద వాహనమైతే రూ.16 వేలు చొప్పున చెబుతున్నారు.

మేడారం తప్పకుండా వెళ్తాను



కుటుంబ సభ్యులంతా కలిసి ఆర్టీసీలో మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు ప్రతిసారి వెళ్తాం. ఈ సారి కూడా కొత్తగూడెం నుంచి ఆర్టీసీ బస్సులోనే వెళ్తున్నాం. రెండేళ్లకోమారు జరిగే ఈ జాతరలో పాల్గొని తల్లులకు మొక్కులు చెల్లించుకుంటాం. పిల్లలతో కలిసి ఆనందంగా గడుపుతాం.

– టి.లక్ష్మణ్, కొత్తగూడెం

ప్రయాణికుల రద్దీ పెరిగింది



జిల్లా నుంచి మేడారానికి వెళ్లే భక్తుల రద్దీ మంగళవారం నుంచి కొంత పెరిగింది. ప్రయాణికులకు అనుగుణంగా వివిధ పాయింట్ల నుంచి ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతోంది. సీటింగ్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకున్నాం. భక్తులు సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలి.

– బి.వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం

పోలీస్‌నని చెప్పి బెదిరింపులు

పోలీస్ స్టేషన్ ఎదుటనే నంబర్ ప్లేట్ లేని కారులో వచ్చి హల్‌చల్


నంబర్ ప్లేట్ లేని కారు.. పోలీస్‌నని చెప్పిన వ్యక్తి

అశ్వారావుపేట: అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం మధ్యాహ్నం ఓ నకిలీ పోలీస్ టూవీలర్ బకాయి వసూలు చేసేందుకు వచ్చి బెదిరింపులకు పాల్పడ్డాడు. అశ్వారావుపేటకు చెందిన ఓ టూవీలర్ షోరూంలో ఓ వ్యక్తి ఫైనాన్స్‌లో వాహనం కొనుగోలు చేశాడు. ఫైనాన్స్ ఇచ్చిన కంపెనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ఎదుట బకాయిదారుడిని నిలిపివేశారు. బైక్ తాళం లాక్కోబోగా అతను నిరాకరించాడు. ఇంతలో నంబర్ ప్లేట్ లేని ఎరుపురంగు మహీంద్రా ఎక్స్‌యూవీ 300 వాహనంలో వసూలుకు వచ్చిన వ్యక్తి బకాయి ఇవ్వాలని బెదిరించాడు. చుట్టుపక్కల వారు ఆయన్ను పోలీస్ అనుకుని ఏమీ మాట్లాడలేకపోయారు. అనంతరం పోలీస్ ఎవరని ఆరా తీయగా తానే పోలీస్ అని ముందు బుకాయించి.. ఆ తర్వాత తన తల్లి ఏపీలోని ప్రకాశం జిల్లా ఎస్పీ కార్యాలయంలో క్లర్క్ అని చెప్పి వెళ్లిపోయాడు. కాగా, ఈ తరహా బెదిరింపులకు పలు ఫైనాన్స్ సంస్థల ఉద్యోగులు పాల్పడుతూనే ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తెలియక పోలీస్ స్టిక్కర్ చూసి భయపడుతున్నారు. అసలు అశ్వారావుపేటలో ఫైనాన్స్ వ్యాపారం చేసేందుకు సదరు కంపెనీకి అనుమతి ఉన్నదా? లేదా? అనే సందేహాలు కూడా ఉన్నాయి. అశ్వారావుపేటలోని పలు టూవీలర్ షోరూంల యజమానులు ఫైనాన్స్ కంపెనీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తూ వారే ఫైనాన్స్ చేస్తున్నట్లు తెలిసింది. ఆ తర్వాత ఇలాంటి నకిలీ పోలీసులు రంగప్రవేశం చేస్తుంటారు. ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

నలుగురు బంగ్లాదేశీయుల అరెస్టు

కొత్తగూడెంఅర్బన్: అక్రమంగా భారతదేశంలోకి చొరబడి నకిలీ ధ్రువపత్రాలను సృష్టించిన నలుగురు బంగ్లాదేశీయులను మంగళవారం అరెస్ట్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తీలో ఒక ఇంటి నిర్మాణ పనులను చేస్తూ అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు వ్యక్తులను కొత్తగూడెం త్రీటౌన్ ఎస్‌ఐ విజయ అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నలుగురు వ్యక్తులు బంగ్లాదేశ్ దేశానికి చెందిన వారని, అక్రమంగా భారతదేశంలోకి చొరబడి స్థానికంగా నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి, ఎవరికీ అనుమానం రాకుండా జీవిస్తున్నారని తేలిందని త్రీటౌన్ సీఐ మురళి వెల్లడించారు. నిందితులలో బంగ్లాదేశ్ దేశం, జహేనైదాహ జిల్లా, డాకతీయ గ్రామానికి చెందిన మహమ్మద్ ఆజాద్, మోహమ్మద్ రాబిన్ మియా, గాడపోట గ్రామానికి చెందిన మహమ్మద్ అలామిన్, గాడపోట గ్రామానికి చెందిన మహమ్మద్ మోహిన్‌లు ఉన్నారని, వారి వద్ద నుంచి నకిలీ ధ్రువపత్రాలను, బ్యాంకు పాస్ బుక్కులను, ఏటీఎం కార్డులను, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాళాలు

యజమానులు ఉండడం లేదని చర్యలు


ఓ ప్లాట్‌కు ఉన్న తాళంపై అధికారులు వేసిన రెండో తాళం

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం సముదాయంలో కొన్ని ఇళ్లకు అధికారులు మంగళవారం తాళాలు వేశారు. ఈ సముదాయంలో చాలా వరకు ఇళ్లలో ఎవరూ నివాసం ఉండడం లేదనే ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు తనిఖీ చేపట్టి ఎవరూ నివాసం ఉండని ఇళ్లపై నోటీసులు అంటించి అప్పటికే ఉన్న తాళంపై మరో తాళం వేశారు. ఇక్కడ 216 ఇళ్లలో 166 ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయించారు. అయితే, లబ్ధిదారులు పలువురు తాళం వేసి ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారని, ఇంకొందరు అద్దెకు ఇచ్చినట్లు ఫిర్యాదులు అందగా, అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు నెలలుగా తాళం వేసి ఉన్న ప్లాట్లకు రెండో తాళం వేసినట్లు తెలుస్తోంది. కాగా, తాము పనులపై బయటకు వెళ్లిన సమయాన తాళాలు వేశారని కొందరు వాపోతుండగా, అధికారులను ఆశ్రయించారు. ప్లాట్లు దక్కించుకున్న కొందరు ఇతరులకు అమ్మినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యాన అధికారులు ఆరు నెలలకో సారి తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల వైఎస్సార్ నగర్‌లో 12, పువ్వాడ నగర్‌లో 16 ప్లాట్ల యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేయగా, తామే ఉంటున్నామని చెబుతూ వారు సమాధానమిచ్చారు. ఇదే విషయమై రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను వివరణ కోరగా ప్లాట్ల ను లబ్ధిదారులు వినియోగించుకోవాలే తప్ప ఇతరుల కు అప్పగిస్తే అర్హత కోల్పోతారని స్పష్టం చేశారు. ఎవరికైనా ప్లాట్ అవసరం లేకపోతే ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలని సూచించారు. కాగా, లబ్ధిదారులే ఉంటున్నా తాళాలు వేసి నోటీసులు ఇవ్వడం గర్హనీయమని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చేపల కోసం అర్ధరాత్రి హల్‌చల్

నేలకొండపల్లి: గుట్టుచప్పుడు కాకుండా చేపలు తీసుకెళ్లేందుకు అర్ధరాత్రి వేళ వచ్చిన పలువురు యువకులు హల్‌చల్ చేస్తూ టిప్పర్ డ్రైవర్‌ను భయభ్రాంతులకు గురిచేసిన ఘటన ఇది. నేలకొండపల్లి మండలం చెరువుమాధారం చెరువులో మూడు రోజులుగా చేపల వేట సాగిస్తుండగా, లీజ్‌కు తీసుకున్న వ్యాపారి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాడు. అయితే, చెరువుమాధారం, మంగాపురం తండా తదితర గ్రామాల యువకులు మాత్రం ఇక్కడే విక్రయించాలని ఘర్షణ పడుతున్నారు. ఈనేపథ్యాన సోమవారం అర్ధరాత్రి కొందరు యువకులు చేపల లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను బుద్ధారం శివార్లలో అడ్డుపడి డ్రైవర్‌తో ఘర్షణకు దిగారు. డ్రైవర్‌ను బెదిరించి దాదాపు ఐదు బస్తాల చేపలను తీసుకుని పారిపోయారు. దీంతో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో సొసైటీ నిర్వాహకులు, పోలీసుల సాయంతో వచ్చేసరికి ఇద్దరు చిక్కారు. ఈసందర్భంగా సొసైటీ నిర్వాహకులు మాట్లాడుతూ ఇతర గ్రామాల నుంచి వచ్చిన వారు చెరువును లూటీ చేయాలని చూస్తున్నందున పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఘటనలో మంగళవారం రాత్రి నేలకొండపల్లి పోలీసుల ఆధ్వర్యాన టమకా వేయించారు. ఇతరులు చెరువులోకి దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలతో వస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

హాస్టళ్లలో వసూళ్లకు పాల్పడిన ఐదుగురి రిమాండ్

కామేపల్లి: ఐహెచ్‌ఆర్‌సీ ప్రెసిడెంట్ పేరిట ప్రభుత్వ హాస్టళ్లలో తనిఖీ చేస్తూ వార్డెన్లు, హెచ్‌ఎంలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఐదుగురి ముఠాను కామేపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కామేపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఐహెచ్‌ఆర్‌సీ ప్రెసిడెంట్‌నని చెబుతూ జర్పుల స్రవంతితో పాటు భూక్యా వెంకటేశ్వర్లు, మల్రికంటి శేఖర్‌మాదిగ, షేక్ ఫరీద్, భూక్యా రెడ్యా సోమవారం వెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో వార్డెన్ వసంత ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కేసు నమోదు

దమ్మపేట: అదనపు కట్నం కోసం భార్యను మానసిక, శారీరక వేధింపులకు గురిచేస్తున్న భర్తపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని అర్బన్‌కాలనీలో బండ్ల శ్రీనివాస్ తన భార్య స్వాతితో కలిసి నివాసముంటున్నాడు. స్వాతిని ఆమె భర్త ఈ నెల 7న అదనపు కట్నం కావాలని డిమాండ్ చేస్తూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశాడు. ఆమెకు సంతానం కలగలేదు అనే కారణంతో విడాకులు ఇస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి వాగు నుంచి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ఎస్‌ఐ రమణారెడ్డి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, బుధవారం రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని ఎస్‌ఐ వివరించారు. కాగా, లక్ష్మీదేవిపల్లి మండలంలో అటవీశాఖ అధికారులు ఇసుక రవాణా చేస్తున్న లారీని మంగళవారం పట్టుకున్నారు. ఈ లారీని సెంట్రల్ పార్క్‌లో పెట్టారు.

సులానగర్‌లో చోరీ

టేకులపల్లి: మండలంలోని సులానగర్ గ్రామంలో మంగళవారం చోరీ జరగగా ఎస్‌ఐ షేక్ సైదారవూఫ్ కేసు నమోదు చేశారు. బాదావత్ బాలాజీ సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో తన ఇంటి ముందు గదిలోని కిరాణా దుకాణం బంద్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో శబ్దాలు వినిపించే సరికి లేచి బయటకు వచ్చాడు. అదే సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి పరుగెత్తుకుంటూ వెళ్లి ఓ తెల్లనికారులో పారిపోయాడు. షాపుని పరిశీలిస్తే తలుపులు పగులకొట్టి ఉన్నాయి. సామగ్రి మాత్రం పోలేదు. ఇంట్లోకి వెళ్లి చూస్తే సుమారు రూ.20 వేల విలువైన రెండు మొబైళ్లు, బీరువాలోని రూ.30 వేల నగదు కనిపించలేదు. టేకులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామవరంలో వ్యక్తి మృతి

కొత్తగూడెంటౌన్: మద్యం మత్తులోనే ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన రామవరంలోని ప్రశాంత్‌నగర్‌కాలనీ పోచమ్మ గుడి ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పోచమ్మగుడి సమీపంలో నివాసముంటున్న బెల్లంకొండ బాలాజీ (40) మద్యం మత్తులో ఇంట్లోనే మరణించాడు. మద్యానికి బానిస కావడంతో ఆయన భార్య పిల్లలను తీసుకుని కొన్ని నెలల కిందట పుట్టింటికి వెళ్లింది. రోజులాగే మద్యం తాగి ఇంటికి చేరుకున్న బాలాజీ మత్తులో కిందపడి మరణించినట్లు గుర్తించిన స్థానికులు ఆయన సోదరుడికి విషయం తెలిపారు. అక్కడికి చేరుకున్న పోలీసులు బాలాజీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామవరం నెహ్రూబస్తీలో అన్న బిందుతో పాటు నివాసముండే బాలాజీ వివాహమైన తరువాత ప్రశాంత్‌నగర్‌కాలనీలో ఉంటున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడు...

కోతులను అదిలించే క్రమంలో ప్రమాదం

తిరుమలాయపాలెం: ఇంట్లోకి వస్తున్న కోతులను అదిలించే క్రమాన విద్యుత్ షాక్‌కు గురైన ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొక్కిరేణిలో మంగళవారం చోటుచేసుకుంది. కొక్కిరేణి గ్రామానికి చెందిన గద్దల గోపయ్య (79) రేకుల ఇంట్లో జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లోకి కోతులు పెద్దసంఖ్యలో వస్తుండగా, వాటిని అదిలించబోయి విద్యుత్ తీగను తాకగా షాక్‌కు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు గోపయ్యను ప్రభుత్వాస్పత్రికి తీసుకవెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య వెంకటమ్మ, కుమారుడు చంద్రశేఖర్ ఉండగా, వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లెందులో లేక్ వ్యూ పార్క్ ప్రారంభం


పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ డీవీ తదితరులు

ఇల్లెందు: పట్టణంలోని ఏకైక లేక్ వ్యూ పార్క్‌ను ఆహ్లాదం కోసం వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. మంగళవారం ఇల్లెందు లేక్ వ్యూ పార్క్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా మున్సిపల్ పాలకవర్గం పార్క్‌ను తీర్చిదిద్దిందని తెలిపారు. ఈ పార్క్ ఇల్లెందు పట్టణానికి తలమానికంగా ఉందన్నారు. త్వరలో పార్క్‌లో ఈత కొలను కూడా ఏర్పాటు చేయబోతున్నామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావలి, ఏఈ కుమారస్వామి, శంకర్‌తోపాటు కొక్కు నాగేశ్వరరావు, డానియేల్, జానీ, పింగళి నరేశ్‌కుమార్, సుదర్శన్ కోరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కష్టించి పనిచేయాలి

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు


సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

ఖమ్మంవన్‌టౌన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలంతా కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు సూచించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని అంశంతో వాటి వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అలాగే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడమే కాక సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నారని విషయాన్ని ప్రజల్లో తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించి, రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసేందుకు అహర్నిశలు పాటుపడాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, దేవీప్రసన్న, నాయకులు ఆదిత, పగడాల మంజుల తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశం కొనసాగుతుండగా కొందరు మహిళలు వచ్చి తమకు సమావేశంపై సమాచారం ఇవ్వలేదని అడగగా, ఎప్పుడు కాంగ్రెస్‌లో చేరారని సౌజన్య ప్రశ్నించడంతో కాసేపు వాగ్వాదం జరిగింది.

లోక్ అదాలత్ పరిష్కరించిన కేసులో రూ.1.75 కోట్ల పరిహారం


జిల్లా జడ్జికి చెక్కు అందజేస్తున్న న్యాయవాది

ఖమ్మంలీగల్: ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించిన మోటారు వాహన ప్రమాదం కేసులో నష్టపరిహారం కింద రూ.1.75 కోట్ల చెక్కును బీమా కంపెనీ న్యాయవాది బండారుపల్లి గంగాధర్ మంగళవారం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్.జగ్జీవన్‌కుమార్‌కు అందజేశారు. కేసు వివరాలిలా ఉన్నాయి. పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అభినందన స్రవంతి 2019లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయమై రాయల్ సుందరం బీమా కంపెనీ నుంచి పరిహారం కోరుతూ కుటుంబీకులు న్యాయవాది మందడపు శ్రీనివాసరావు ద్వారా కోర్టులో కేసు దాఖలు చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఈ కేసు పరిష్కారానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్ చొరవ చూపగా ఇరుపక్షాల వారు అంగీకరించారు. దీంతో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రాంప్రసాదరావు రూ.1.75 కోట్లకు అవార్డు జారీ చేశారు. ఈ మేరకు బీమా కంపెనీ న్యాయవాది మంగళవారం చెక్కు రూపంలో జిల్లా జడ్జికి అందజేశారు.

మల్టీపర్పస్ వర్కర్‌పై కేసు

పెనుబల్లి: మండలంలని మండాలపాడు గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న తడికమళ్ల మన్మథరావుపై పంచాయతీ కార్యదర్శి కామిశెట్టి నర్సింహారావు ఫిర్యాదు మేరకు వీఎం బంజర్ పోలీసులు కేసునమోదు చేశారు. పంచాయతీ కార్యదర్శి సోమవారం ఉదయం విధులు నిర్వర్తిస్తుండగా, మన్మథరావు వచ్చి దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించడమే కాక కార్యదర్శి ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశాడు. ఈఘటనపై నర్సింహారావు చేసిన ఫిర్యాదుతో మంగళవారం కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలపరిషత్ కార్యాలయం, ఎల్‌ఐసీ కార్యాలయం వెనుక ఉన్న అటవీ అభివృద్ధి కార్పొరేషన్‌కు చెందిన జామాయిల్ తోటలో మంగళవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుమారు ఐదు హెక్టార్ల అడవిలో చెట్ల కింద పోగైన చెత్త కాలిపోయింది. గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్లు తాగి ఆర్పకుండా పడవేయడంతో ఎండిన ఆకులకు మంట అంటుకుని వ్యాపించి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. కాగా, సత్తుపల్లి నుంచి ఫైరింజన్ సిబ్బంది మంటలు విస్తరించకుండా ఆర్పివేశారు.